క్లుప్తంగా

విజయదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న విజయదుర్గ అమ్మవారు

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన విజయ దుర్గ అమ్మవారికి విశేష పూజలు చేశారు. శుక్రవారం జ్యేష్ఠ మాసం ప్రారంభం సందర్భంగా అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు విజయదుర్గ అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై, అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

విజయ దుర్గాంబిక ఆలయంలో..



విజయ దుర్గాంబిక అమ్మవారు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో మంచినీటి చెరువు వద్ద కొలువై ఉన్న విజయ దుర్గాంబిక ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణ శర్మ తెల్లవారుజామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కారును ఢీకొన్న లారీ



లారీ ఢీకొనడంతో డివైడర్ పైకి ఎక్కిన కారు

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడి విమానాశ్రయం పాత గేటు వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరంలోని గెయిల్ సంస్థలో పనిచేస్తున్న లొట్టా వెంకటేశ్వరరావు కారులో విమానాశ్రయానికి వెళుతున్నారు. అదే రోడ్డులో వేగంగా వచ్చిన పది చక్రాల లారీ.. కారును ఓవర్ టేక్ చేసింది. అదే సమయంలో లారీ కమ్మీలు కారును ఢీకొన్నాయి. దీంతో కారు రోడ్డు మధ్యలోని డివైడర్ పైకి ఎక్కి, అక్కడ ఉన్న స్తంభాన్ని ఢీకొంది. కారులోని వెంకటేశ్వరరావుకు స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు



నరసన్నను దర్శించుకుంటున్న వీరన్న చౌదరి

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీనరసింహ స్వామిని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం ఎంపీగా దగ్గుపాటి పురందేశ్వరి ఘన విజయం సాధించడంపై స్వామివారికి పూజలు జరిపామన్నారు. గెలిచిన ప్రజా ప్రతినిధులందరూ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

పర్యావరణంపై ప్రజలకు అవగాహన



పర్యావరణ రక్షణపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు

మధురపూడి: కోరుకొండ **మండలం దోసకాయలపల్లి** ఎస్సీపేటలోని **సామాజిక భవనం** వద్ద శుక్రవారం మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మొక్కలు నాటుదాం – పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదాలతో ర్యాలీ చేశారు. పర్యావరణ పరిరక్షణపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రియాంక, మరియ పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం

ప్రకాశం నగర్: లాలాచెరువు వద్ద గల గోవింద క్షేత్రంలో శుక్రవారం శ్రీనివాసుడు, పద్మావతీ అమ్మవార్ల కల్యాణాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

సాగుదాం

- ఖరీఫ్‌కు అన్నదాతల సన్నద్ధం
- విత్తన శుద్ధిపై దృష్టి సారించాలంటున్న వ్యవసాయ నిపుణులు

పెదపూడి: తొలకరి సాగు కోసం ఈ నెల ఒకటో తేదీన అధికారులు పంట కాలువలకు సాగు నీరు విడుదల చేశారు. రైతు భరోసా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో అన్నదాతలు సాగుకు సన్నద్ధమై, నారుమడుల పనులు చేసుకుంటున్నారు.

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో మొత్తం ఖరీఫ్‌లో సుమారు 86 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. బోర్లు, ఇంజిన్ల వద్ద సుమారు 15 రోజుల క్రితం నుంచే నారుమళ్ల పనుల్లో అన్నదాతలు బిజీబిజీగా గడుపుతున్నారు. ఇప్పటి వరకూ అనపర్తి నియోజకవర్గంలో సుమారు ఐదు శాతం మేర నారుమడులు సిద్ధం చేసినట్టు అంచనా. కాలువల ద్వారా సాగునీరు విడుదల చేసిన నేపథ్యంలో పెద్ద కాలువల నుంచి వాటి అనుబంధ కాలువలకు సాగునీరు నెమ్మదిగా చేరుతోంది. ముందుగా బోర్ల వద్ద నారుమళ్లు చేసిన చోట జూలై మొదటి, రెండో వారాల నుంచి వరినాట్లు వేయనున్నారు.

నాణ్యమైన నారు ఇలా..

విత్తనం కొన్న వెంటనే 100 గింజలను మొలక పరీక్ష చేసి, 80 శాతం మొలక వచ్చిన విత్తనాలనే వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అలాగే విత్తన శుద్ధితో నాణ్యమైన నారు లభిస్తుంది. పొడి శుద్ధి విధానంలో కిలో విత్తనాలకు మూడు గ్రాముల చొప్పున కార్బండిజం మందు విత్తనాల సంచిలో వేసి, మూతి బిగించి, బాగా కలిపి 24 గంటలు నిల్వ ఉంచాలి. ఆ తర్వాత వాటిని నానబెట్టి నారుమడిలో చల్లుకోవాలి. తడి విత్తన శుద్ధి విధానంలో కిలో విత్తనాలకు ఒక గ్రాము కార్బండిజం లీటరు నీటిలో కలిపి 24 గంటలు నానబెట్టి, మరో 24 గంటలు ముడి కట్టి వాటిని నారుమడిలో చల్లుకోవాలి.

నారుమడి తయారీ

నారుమడి తయారు చేసుకోవడానికి వినియోగించే భూమిలో చివరి దుక్కిలో, ఐదు సెంట్ల భూమికి రెండు కిలోల యూరియా, ఆరు కిలోల సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్, కిలో ఎంఓపీ(మ్యూరేట్ పొటాష్)ను కలిపి దుక్కి చేయాలి. ఆకుమడిలో ముంపు నీరు దిగేందుకు చిన్న చిన్న బోదెలు, ఆకుమడి చుట్టూ ఏర్పాటు చేసుకోవాలి. నారుమడిలో విత్తనాలు చల్లుకున్న తర్వాత మొదటి ఆకు విచ్చుకునే వరకు 10 రోజుల పాటు ఆరుతడి యాజమాన్యం (నారుమడిలో నీరు పెట్టడం, తొలగించడం) నిర్వహించాలి. 11వ రోజు తర్వాత మొదటి ఆకు విచ్చుకున్నాక నారుమడిలో నీరు ఉండాలి. ఇలా నారుమడి వేసిన 21–25 రోజుల్లో నాణ్యమైన నారు తయారవుతుంది.

ఎకరాకు 30 కేజీలు

ఒక ఎకరా నారుమడికి 30 కేజీల వరి విత్తనాలు అవసరమవుతాయి. సాధరణంగా ఖరీఫ్‌లో 90 శాతం స్వర్ణ రకం ఎంటీయూ 7029, ఎంటీయూ 1318 రకాలు సాగు చేస్తారు. ఇతర రకాలు బీపీటీ 5204, ఎన్‌ఎల్ఆర్ 4001 తదితరత రకాలు పది శాతం సాగు చేస్తారు. విత్తనాలు రైతు భరోసా కేంద్రాలు, పీఏసీఎస్‌ల్లో అందుబాటులో ఉన్నాయి. లైసెన్సు పొందిన షాపులు, రైతుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసుకోవచ్చు.



గండ్రేడులో తయారు చేసిన నారుమడి

విత్తన శుద్ధి తప్పనిసరి



రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి. అనంతరం నారుమడులు వేయాలి. నారుమడి తయారు చేసేటప్పుడు విత్తనాల సంచిని, బ్యాగ్‌ను, రశీదును జాగ్రత్తగా ఉంచుకోవాలి. ఈ ఖరీఫ్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు పీఏసీఎస్‌ల్లో అందుబాటులో ఉన్నాయి.

– టీవీఆర్ మణిదీప్, మండల వ్యవసాయ శాఖాధికారి, పెదపూడి

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే రౌడీషీట్లే..



జి.మామిడాడలో ప్రత్యేక పోలీసు బలగాలతో ఎస్సై శోభన్‌కుమార్

పెదపూడి: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రౌడీషీట్లు తెరుస్తారని ఎస్సై శోభన్‌కుమార్ హెచ్చరించారు. మండలంలో వేండ్ర, జి.మామిడాడ, శహపురం, కాండ్రేగుల తదితర గ్రామాల్లో శుక్రవారం పోలీసు ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై శోభన్‌కుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎవరైనా రాజకీయ ద్వేషంతో వ్యక్తిగతంగా, వేరొకరిపై భౌతికంగా, వారి ఆస్తులపై, ప్రభుత్వ కార్యాలయాలపై దాడులకు పాల్పడితే, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అల్లర్లు, దాడులకు ఎవరైనా ప్రోత్సహించినా, వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా సంయమనంతో వ్యవహరించి, పోలీసులకు సహకరించాలన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెటింగ్ ఆఫీసర్ వినయ్ సునీల్, చిత్రంలో రుక్కయ్య, అనంతరావు తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ బలమైన, పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ ఎం.వినయ్ సునీల్ అన్నారు. కన్స్యూమర్ వాయిస్, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక క్వారీ మార్కెట్ రైతు బజార్‌లో ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం నిర్వహించారు. కన్స్యూమర్ వాయిస్ అధ్యక్షుడు, జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వినయ్ సునీల్ తో పాటు జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వి.రుక్కయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రుక్కయ్య మాట్లాడుతూ ఆహార భద్రత విషయంలో లోపాలు ఉంటే కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లాలోని అనేక రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించి క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. ప్రతి ఆహార సంబంధిత వ్యాపారస్తుడు ఫుడ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ నాణ్యమైన, సురక్షితమైన ఆహారం తీసుకోవాలన్నారు. గొట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ ఎవరైనా ఆహార నాణ్యతా ప్రమాణాల్లో లోపాలను గుర్తించి తమ దృష్టికి తీసుకువస్తే, వెంటనే జాయింట్ కలెక్టర్‌కు తెలిపి, సమస్య పరిష్కారానికి దోహదపడతామన్నారు. అనంతరం రైతుబజార్‌లోని షాపులను తనిఖీ చేసి రైతులకు, వ్యాపారస్తులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ కమిటీ సభ్యులు ధర్నాలకోట వెంకటేశ్వరరావు, కేవీ రమణ, అమరవాది రామకృష్ణ, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం



శిక్షణ తరగతుల్లో సాధించిన ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

రంగంపేట: వేసవి విజ్ఞాన శిబిరం పేరిట విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వి.వెంకటరమణ అన్నారు. శుక్రవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎస్.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో గత 25 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో పుస్తక పఠనాభిలాషను పెంపొందించే లక్ష్యంతో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించడం గొప్ప విషయ మన్నారు. పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్ తగ్గించి, పుస్తక పఠనంపై శ్రద్ధ చూపాలన్నారు. ఈ శిబిరంలో రాయడం, కథలు చెప్పడం, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్, తెలుగు వ్యాకరణం, బాలల గేయాలు తదితర అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. శిక్షణ ఇచ్చిన రిసోర్స్‌పర్సన్లను ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

చైర్మన్ పదవికి బర్రే కొండబాబు రాజీనామా



రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న కొండబాబు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ పదవికి బర్రే కొండబాబు రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపించారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం జీవకారుణ్య సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తమ హయాంలో జీవకారుణ్య సంఘానికి సంతృప్తికరంగా సేవలు అందించామని చెప్పారు. దాత కారుణ్యానంద స్వామీజీ ఆశయాల మేరకు జీవకారుణ్య సంఘంలోని వృద్ధులు, అనాథ బాలలు, రోగులకు మెరుగైన సదుపాయాలు కల్పించడానికి తనతో పాటు పాలక మండలి సభ్యులు కృషి చేశామన్నారు. ఈవో పల్లంరాజు, సిబ్బంది సహకారంతో ప్రతి ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి వృద్ధులు, ఇతరులకు భోజనం, అల్పాహారంలో మార్పులు చేసి వారందరికీ పౌష్టికాహారం అందేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు నాగులాపల్లి దేవీ లక్ష్మణరావు, చొల్లంగి ఏడుకొండలు, పిల్లి నాగేంద్ర కుమార్, పైడా ఉషా వాసు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

కడియం: మండల కేంద్రమైన కడియంలోని శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం శుక్రవారంతో ముగిసిందని లైబ్రేరియన్ శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల తెలిపారు. చివరి రోజు కార్యక్రమానికి విశ్రాంత తెలుగు పండితుడు, సినీ గేయరచయిత దేవవరపు నీలకంఠరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. శిబిరంలో జరిగిన పలు కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పుస్తకాలు, పంపిణీ చేశారు. నీలకంఠరావు మాట్లాడుతూ గురువులు, తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించాలని, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని చిన్నారులకు సూచించారు.

అలాగే బి.రామకృష్ణ మిమిక్రీతో అలరించారు. సీహెచ్ రామకృష్ణ ధ్యానం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇన్నీసుపేటలో..

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ముందుగా సరస్వతీ దేవీ విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపక కార్యదర్శి మతల రమేష్, టీచర్లు, ట్రస్ట్ సభ్యులు, గ్రంథాలయ కార్యదర్శి శ్రీదేవి తెలిపారు.

కాగితం పూల సోయగం

- బోగన్ విలియా పేరుతో ప్రసిద్ధి
- ఆసియాలోనే ప్రముఖ అలంకరణ మొక్క
- ఆకట్టుకుంటున్న వినూత్న వెరైటీలు



కడియం నర్సరీలో కనువిందు చేస్తున్న బోగన్ విలియా మొక్కలు

కడియం: అత్యంత సున్నితమైన పూల రేకులు, రంగురంగుల పూలతో కనువిందు చేసే బోగన్ విలియా రకం మొక్కలు చూడగానే ఆకట్టుకుంటాయి. ఆసియా ప్రాంతంలో అలంకరణ మొక్కల్లో వీటిని ప్రాధాన్యం ఎక్కువ. ఎలాంటి వాతావరణంలోనైనా బతకడం, అందమైన పువ్వులను ఇవ్వడం ఈ మొక్క ప్రత్యేకత. వేసవి, శీతాకాలాల్లో పువ్వులు పూచే ఈ మొక్క ప్రస్తుతం సరికొత్త వెరైటీలతో మొక్కల ప్రేమికులను ఆకట్టుకుంటోంది. వీటిలో దాదాపు వందకు పైగా రకాలు ఉన్నాయని నర్సరీ రైతులు చెబుతున్నారు. వేసవిలో తక్కువగా, శీతాకాలంలో ఆకులు కూడా కనిపించనంతంగా పువ్వులు పూచే ఈ బోగన్ విలియాలు లాండ్‌స్కేపింగ్‌లో కూడా ప్రాముఖ్యత పొందుతున్నాయి. అతి తక్కువ నీటిని వినియోగించుకునే ఈ మొక్క మొండి జాతికి చెందినది. రోడ్డు డివైడర్లు, ల్యాండ్‌స్కేపింగ్ డిజైన్లలో బోర్డర్లుగా వీటికి మంచి డిమాండ్ ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఈ మొక్కలను ట్రిమ్మింగ్ చేసి పలు ఆకారాల్లో కూడా రూపొందించుకునే వెసులుబాటు ఉంది.

దాదాపు 20కి పైగా రకాలు

బోగన్ విలియా తిమ్మా, మహారా, చిత్ర, డాక్టర్ రావు, గ్లోబ్రా, ఎస్పీ సింగ్, ఛోబ్రా, పింక్ సుప్రీమ్, లేడీ మేరీ బేరింగ్, చెర్రీ బ్లోసమ్ తదితర 20కి పైగా రకాలకు చెందిన పువ్వులు అత్యంత ఆకర్షణీయంగా ఉంటాయి. మన దేశంతో పాటు చైనా, థాయిలాండ్, మలేసియా, సింగపూర్‌తో సహా అన్ని ఆసియా దేశాల్లోనూ బోగన్ విలియా మొక్కలు లభిస్తాయి. భారీ సైజులో పెరిగే మొక్కలతో పాటు, కుండీల్లో పెంచుకునేందుకు బోన్సాయ్ రకాలు కూడా వీటిలో అందుబాటులో ఉంటాయి. గులాబీల తరువాత విశేష ప్రాధాన్యమున్న వీటిపై నిరంతరం పరిశోధనలు సైతం జరుగుతుంటాయి. దీని ద్వారా సరికొత్త రకాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఐదారు రంగుల పువ్వులను ఒకే మొక్కకు పూచేలా థాయిలాండ్ వంటి దేశాల్లో తయారు చేశారు. పరిశోధకులు, ఉత్పత్తిదారులతో కలిసి 'బోగన్ విలియా సొసైటీ ఆఫ్ ఇండియా' కూడా ఉంది. వీరు ప్రత్యేకంగా వెబ్‌సైట్ కూడా నిర్వహిస్తున్నారు.

గ్రాఫ్టింగ్ వెరైటీలకు గిరాకీ

గ్రాఫ్టింగ్ విధానంలో ఒకే మొదలుకు ఐదారు రకాల రంగుల పువ్వులు వచ్చేలా బోగన్ విలియాను సృష్టిస్తున్నారు. వీటిని మల్టీలుగా పిలుస్తున్నారు. విభిన్నంగా కనిపించే ఈ గ్రాఫ్టింగ్ వెరైటీలపై కొనుగోలు దారులు ఆసక్తి చూస్తున్నారని నర్సరీ రైతులు, మొక్కల అమ్మకందారులు చెబుతున్నారు. అత్యంత ఆకర్షణీయంగా ఉండే రంగులున్న మొక్కలను విదేశాల నుంచి లక్షల రూపాయలు వెచ్చించి రైతులు దిగుమతి చేసుకుంటున్నారు. ఇక్కడి వాటిని అభివృద్ధి చేసి దేశమంతా విస్తరిస్తున్నారు. ఈ మొక్క సైజును బట్టి ఆరు రూపాయల నుంచి వెయ్యి రూపాయల వరకూ పలుకుతోంది.

ఆర్బీకే చైర్మన్ పదవికి వెంకట్రాజు రాజీనామా



సీతానగరం: ఆర్బీకే మండల చైర్మన్ పదవికి వైఎస్సార్ సీపీ నాయకుడు వలవల వెంకట్రాజు (తోటలో రాజు) రాజీనామా చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తన పదవికి రాజీనామా చేశానన్నారు. రాష్ట్రంలో పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించిన జగన్, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన జక్కంపూడి రాజా ఓటమి చెందడంతో మనస్థాపానికి గురయ్యానన్నారు. రాజీనామా పత్రాన్ని సంబంధిత అధికారులకు అందజేసినట్టు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్

సీతానగరం: మండలంలోని సింగవరం ఇసుక ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం రాత్రి 11.30 గంటలకు ఎస్సై టి.రామకృష్ణ సీజ్ చేశారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానికులు అడ్డుకుని ఎస్సైకు సమాచారం అందించారు. పోలీసులు దాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లంకూరుకు చెందిన ట్రాక్టర్‌గా గుర్తించారు. దానికి సంబంధించిన నివేదికను తహసీల్దార్ బి.నెల్సన్ పాల్‌బాబుకు అందజేశారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



ఎమ్మెల్యే బలరామకృష్ణను అభినందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

రాజానగరం: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే ప్రభుత్వ ఉద్యోగులందరూ తమ విధులను సమర్థంగా, సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు శుక్రవారం రాజమహేంద్రవరంలోని నివాసంలో ఎమ్మెల్యేను కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

రౌడీయిజం చేస్తే చట్టపరమైన చర్యలు



అంబికా ప్రసాద్, డీఎస్పీ

కంబాలచెరువు: రౌడీయిజం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ అంబికా ప్రసాద్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. సౌత్ జోన్ పరిధిలోని టూటౌన్, ధవళేశ్వరం, కడియం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎవ్వరూ అనవసర ఆవేశాలు, ఉద్వేగాలతో హింస చెలరేగే విధంగా ప్రవర్తించొద్దన్నారు. వేరే ప్రాంతం వారిని చూసి మన ప్రాంతంలో లేని కొత్త విధానాలు, కొత్త పోకడలను తెచ్చి అనవసరంగా వర్గాల మధ్య చిచ్చురేగే విధంగా చేయవద్దన్నారు. శాంతియుత వాతావరణానికి భంగం కలగనీయవద్దని, ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు ఉంటాయన్నారు. కోపతాపాలకు పోయి హింసా ప్రవృత్తికి పాల్పడవద్దని, చట్ట పరిధిలో అందరూ సమానమేనన్నారు. రౌడీయిజం, దౌర్జన్యం వంటివి ఎవరు చేసినా చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంతంగా ఉండే ప్రాంతాల్లో తమ మాటలు, చర్యల ద్వారా అనవసరమైన అలజడి సృష్టిస్తే అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో అందరూ సహకరించాలన్నారు.

ట్రైనింగ్ కళాశాలలో ముగిసిన శిక్షణ

కంబాలచెరువు: స్థానిక ట్రైనింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రీప్రెస్‌మెంట్ ట్రైనింగ్ కంటెంట్ ఏజ్ అప్రాప్రైట్ టూల్ శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ శిక్షణకు జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు హాజరై పలు సూచనలు చేశారు. 1, 2 తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పొందిన మెలకువలతో విద్యార్థులకు ఆహ్లాదకర విద్యనందించాలన్నారు. విద్యార్థులకు కథలు, ఆటపాటల ద్వారా విద్యను బోధించాలన్నారు. శిక్షణ కార్యక్రమం ఇన్‌చార్జిగా పి.మధుసూదనరావు, ఐ.మల్లేశ్వరరావు, ఎం.రామకృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ సుభాషిణి, డైట్ ప్రిన్సిపాల్ జయశ్రీ, డీవైఈవో కె.నారాయణ, గౌరీ శంకర్, గంగాధర్ పాల్గొన్నారు.